క్లుప్తంగా

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం



వరంగల్ చౌరస్తా: గిర్మాజీపేటలోని నిరుపేద కుటుంబానికి చెందిన బొడ్ల అఖిల్‌కు ఉన్నత విదేశీ విద్యాపథకం కింద పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులోని భవన్‌లో మాజీ మేయర్, పట్టణ అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు అఖిల్‌కు రూ.15 వేల నగదును గురువారం అందజేసి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తోనుపునూరి వీరన్న, కల్పన, నాగరాజు, సదాశివుడు, కొండూరి శివప్రసాద్, గాదె వాసుదేవ్, రమేష్, గుండు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ పత్రికా దినోత్సవం



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జర్నలిజం విభాగంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ ఆదిరెడ్డి, రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తిరుణహరి శేషు మాట్లాడుతూ ప్రజాస్వామిక వ్యవస్థలో పత్రిక, మీడియా రంగాలు చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రపంచంలో పత్రికా వ్యవస్థ ఎంతో ఉన్నతంగా ఎదుగుతోందని వివరించారు. గన్ కంటే పెన్ పవర్ చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికుమార్, డాక్టర్ ఐలేశ్వర్, డాక్టర్ రాంబాబు, జర్నలిజం విభాగం విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

రామన్నపేట: వరంగల్ నగరం అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ వరంగల్ తూర్పు అభ్యర్థి కొండా సురేఖ అన్నారు. 23వ డివిజన్ కొత్తవాడలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. రాహుల్ గాంధీ సభకు ప్రజలు తరలిరావాలని కోరారు.

వరంగల్‌కు పరిశ్రమలను తీసుకొస్తా..



వరంగల్: ఏనుమాముల మార్కెట్‌లో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు



కాశిబుగ్గ: సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

- బీజేపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్: కేంద్రం నుంచి వరంగల్‌కు మరిన్ని పరిశ్రమలను తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తానని, అధిక నిధులు తెచ్చి తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీజేపీ వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, అడ్తి వ్యాపారులు, గుమస్తాలు, హమాలీలను గురువారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఆజంజాహి మిల్స్ లాంటి పరిశ్రమలను తూర్పు నియోజకవర్గానికి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. టెక్స్‌టైల్ పార్కు త్వరగా పూర్తయ్యేలా చూస్తానని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, బీసీ బంధు వంటి పథకాలు అర్హులకు అందలేదని విమర్శించారు. నగరానికి ఏడాదికి రూ.300 కోట్ల చొప్పున నిధులు ఇస్తానన్న కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. పీఎం నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని చెప్పారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొనే ఓరుగల్లు విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ వరంగల్ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఓసిటీలోని ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో శనివారం మధ్యాహ్నం జరుగనున్న సభకు వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేటకు చెందిన పార్టీ నాయకులు, జనసేన కార్యకర్తలు, మందకృష్ణ మాదిగ అభిమానులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 42వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు గంద్రతి కుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో కుసుమ సతీష్, సముద్రాల పరమేశ్వర్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, గంటా రవికుమార్, బాకం హరిశంకర్, కునుకుంట్ల రంజిత్, రఘునారెడ్డి, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యకళాశాలలో ఫ్రెషర్స్ డే



వేడుకల్లో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, ప్రొఫెసర్లు

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు బీఏఎంఎస్ రెండవ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థులు కలిసిమెలిసి ఉంటూ చదువుకోవాలని సూచించారు. కృష్టపడి చదివి ఉన్నతులుగా ఎదిగి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనాచారి, ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాల్నె సాంబమూర్తి, రిటైర్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ప్రొఫెసర్లు, అసోసియేటెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

కేడీసీకి అటానమస్ హోదాపై హర్షం



రాజారెడ్డి, రమేష్‌ను సన్మానిస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ కళాశాలగా పేరొందిన, న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగిన హనుమకొండలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల.. యూజీసీ నుంచి అటానమస్ హోదా పొందడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌ను జీసీజీటీఏ బాధ్యులు, ప్రభుత్వ పింగిళి కళాశాల, కేడీసీ యూనిట్ల బాధ్యులు గురువారం సన్మానించారు. అలాగే ఐక్యూఏసీ బృందం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జీసీజీటీఏ కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకన్న, శిరీష, అశోక్, ఇందిరా, నైనాదేవి, పార్వతి, స్నేహలతరెడ్డి, సుహాసిని, కిరణ్, సునీత, మాధవి, రేణుక, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మాతంగి శ్రీనివాస్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తోందని అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మాతంగి శ్రీనివాస్ అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయ స్పోర్ట్స్ హాల్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్‌కు సభ్యుల బాగోగులే ప్రధానమన్నారు. అసోసియేషన్ బలోపేతానికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అలాగే సంస్థ మనుగడకు కూడా తమ వంతు కృషి చేయాలన్నారు. అసోసియేషన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి బక్క దానయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.ఉపేందర్, ఉపాధ్యక్షులు రామస్వామి, రౌతు రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖిలా వరంగల్: ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంతోపాటు సామాజిక సేవా దృక్పథాన్ని నెలకొల్పడానికి కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వలంటీర్లకు కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు కేటాయించిన పాఠశాలకు వెళ్లి ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించడానికి వలంటీర్లకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాల్యానాయక్, అధ్యాపకులు రహీమొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, రుద్రాణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

దశాబ్ద కాలంలోనే అభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేష్



పర్వతగిరి: ఓటు అభ్యర్థిస్తున్న రమేష్

- బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్

పర్వతగిరి : అనేక ఏళ్లుగా వెనుకబడిన అభివృద్ధిని కేవలం దశాబ్ద కాలంలోనే పూర్తి చేసుకున్నట్లు బీఆర్ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఏబీతండా, చింతనెక్కొండ, భట్టుతండా, తూర్పుతండా, గుగులోత్ తండా, ఏనుగల్, మల్యా తండా, మూడెత్తుల తండా, శ్రీనగర్, కొంకపాక, గోపనపల్లి, అనంతారం గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, కోలాటాలు, బతుకమ్మలు, మంగళ హారతులతో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు స్వాగతం పలికి గజమాలతో రమేష్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదని అన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఇద్దరు ఎంపీటీసీలు

పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ ఎంపీటీసీ మాలోత్ కాంతమ్మలాలూ, గోపనపల్లి ఎంపీటీసీ సురం రమేష్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి అరూరి రమేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. అలాగే, భట్టుతండాలో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ భట్టు రాంబాబుతో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరారు.

అభివృద్ధే 'అరూరి'ని గెలిపిస్తుంది

వర్ధన్నపేట : తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో అభివృద్ధి చేసి చూపించిన ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ప్రజలు మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటారని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి అన్నారు. అరూరిని మూడోసారి గెలిపించి హ్యాట్రిక్ సాధించడానికి మండలంలోని ల్యాబర్తి, టీకుల తండా, కొత్తపల్లి, రామోజీ కుమ్మరిగూడెం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

14వ డివిజన్‌లో..

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి సుమారు 40మంది కార్యకర్తలు గురువారం బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ ఆహ్వానించారు. అనంతరం, రమేష్ మాట్లాడుతూ పార్టీ మేనిఫెస్టోకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి కాపాడుకుంటామని అన్నారు.

హసన్‌పర్తి: అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హసన్‌పర్తి, ముచ్చర్ల, భీమారం, ఎర్రగట్టు గుట్ట, దేవన్నపేట, మడిపల్లి, అన్నాసాగరం, వంగపహాడ్, పెగడపల్లి, గోపాలపురంలో ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

అభివృద్ధి చేసే పార్టీని ఆదరించండి..



మాట్లాడుతున్న అనిల్ కూర్మాచలం

హన్మకొండ: అభివృద్ధి చేసే పార్టీని ఆదరించాలని బీఆర్ఎస్ ఎన్నారై సెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల చూసి ఓటేయాలన్నారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రధాన కార్యదర్శి కడుదుల రత్నాకర్, ఎన్ఆర్ఐ సెల్ అమెరికా నాయకురాలు బింధులత మాట్లాడుతూ దేశంలోనే రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి గొప్ప పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఐ సెల్ నాయకులు కోరబోయిన విజయ్ కుమార్, నవీన్ రెడ్డి, గొట్టిముక్కల సతీష్ రెడ్డి, శానబోయిన రాజ్ కుమార్, ప్రవీణ్ పంతులు, ఆకుల వినయ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

దేశాయిపేట: డ్రగ్స్ నివారణలో ఎన్‌సీసీ కేడెట్లు ప్రధాన పాత్ర పోషించాలని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ సూచించారు. ఈమేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ సీకేఎం కళాశాలకు ఎన్‌సీసీ కేడెట్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తుకు అలవాటుపడి యువత తన ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్ లేని సమాజాన్ని నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. వరంగల్ 10వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కందూరి మాట్లాడుతూ డ్రగ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల అనర్థాలు సంభవిస్తున్నాయని చెప్పారు. అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. కళాశాల నుంచి పోచమ్మమైదాన్ సర్కిల్ వరకు కేడెట్లు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ సతీష్‌కుమార్, మోహన్, జీకే.కుమార్, రమేష్, శ్రీనివాస్, అరుణ, సుమలత పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

హన్మకొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జ్ రమా శరవణ్ అన్నారు. హనుమకొండ స్నేహనగర్‌లోని ఎస్ఆర్ డీజీ స్కూల్‌లో ఎస్ఆర్ డీజీ స్కూల్ స్నేహనగర్, గోపాల్‌పూర్ బ్రాంచీల క్రీడా పోటీలు గురువారం జరిగాయి.

కిట్స్‌లో పుస్తక ప్రదర్శన

హసన్‌పర్తి: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కేయూ లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.అంజయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణకు ఆధునిక సాంకేతికతను జోడించడానికి గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.

సుమతిరెడ్డిలో అభిజ్ఞాన్ వేడుకలు

హసన్‌పర్తి: అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ అభిజ్ఞాన్ -2.0 వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి.

పేదవాడి హక్కుల కోసం పోరాడతా..

నయీంనగర్: పేదవాడి హక్కుల కోసం పోరాడతానని, అమాయకులకు అన్యాయం జరగకుండా పోరాటం చేస్తానని వరంగల్ తూర్పు స్వతంత్ర అభ్యర్థి పల్లకొండ మల్లీశ్వరి అన్నారు. ప్రజలు తనను ఆదరించి గెలిపించాలని కోరారు.

అయ్యప్ప మాలధారణ

కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలోని హరిహరపుత్రుడు అయ్యప్పస్వామికి మాలధారణ కార్యక్రమం గురువారం జరిగింది.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నం

హసన్‌పర్తి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించడంతో ఓ కానిస్టేబుల్ అతన్ని రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన గురువారం రాత్రి ఎల్లాపురం రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రంగపూర్‌కు చెందిన చీకోటి ఆంజనేయులు స్థానికంగా మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. అయితే, కొంతకాలంగా అన్నదమ్ముల మధ్య ఆస్తి గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసిక వేదనకు గురైన ఆంజనేయులు ఆత్మహత్య చేసుకునేందుకు బయటికి వెళ్లాడు. సమాచారం అందుకున్న కానిస్టేబల్ నాగరాజు అక్కడికి చేరుకుని పట్టాలపై నిలబడి ఉన్న ఆంజనేయులను రక్షించాడు. దాంతో నాగరాజును ఏసీపీ డేవిడ్ రాజు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపున్న జర్నలిస్టులు

వరంగల్ అర్బన్: కాంగ్రెస్ జనగామ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి.. విలేకరులపై పరుష పదజాలం ఉపయోగించడంపై జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో గురువారం నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆంగ్ల పత్రిక విలేకరి బుధవారం జనగామలో రేవంత్ రెడ్డి బహిరంగ సభ కవరేజ్ నిమిత్తం వెళ్లారని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరు ప్రతాప్‌రెడ్డిని కలిసి వస్తున్న క్రమంలో ప్రతాప్‌రెడ్డి అకారణంగా ఆ విలేకరిపై పరుష పదజాలం ఉపయోగించారని వాపోయారు. కొమ్మూరి చర్యకు నిరసనగా జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రతాప్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే సేఫ్టీ అధికారుల తనిఖీలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని వివిధ విభాగాల్లో సికింద్రాబాద్ డివిజన్ రైల్వే సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ల విశ్రాంతి కార్యాలయం, రన్నింగ్ రూం, రైల్వే చీఫ్ క్రూ కంట్రోల్ డ్రైవర్ల కార్యాలయం, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్‌టీ) ప్రత్యేక రైలు బోగీలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి స్థానిక ఆయా విభాగాల అధికారులతో మాట్లాడారు. కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అగ్గి రవీందర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: తెలుగు వెలుగు జాతీయ పురస్కారాలకు ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలుగు వెలుగు సాహితీవేదిక (టీవీఎస్‌వీ) జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ కన్వీనర్ డాక్టర్ వలబోజు మోహన్‌రావు, వరంగల్ సిటీ అధ్యక్షుడు డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం, ముఖాభినయనం, హరికథ, ఒగ్గుకథ, బుర్రకథ, రంగస్థలం, జ్యోతిష్యం, యోగా, డోలక్, హార్మోనియం, భజనరంగం, సామాజిక సేవారంగం, క్రీడలు, షార్ట్‌ఫిలిం, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాప్రతినిధుల రంగాల్లో ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి డిసెంబర్ 10న విజయవాడలో పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 9100174351, 9441261585) నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

కేవీలో సెల్ఫీ పాయింట్



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ వరంగల్ పాఠశాల ఆవరణలో సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. కేవీ వరంగల్ పీఎం శ్రీ కేవీ వరంగల్‌గా రూపాంతరం చెందిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన జీ-20, ఫిట్ ఇండియా, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, స్వచ్ఛతా హీ సేవా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలతో సెల్ఫీ స్టేషన్‌ను కేవీ యాజమాన్యం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కేవీ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.